# ప్రజా పాలనా..? దౌర్జన్య పాలననా...?

- నోటిఫికేషన్ లేకుండా అధికారులు ఎలా హాజరు అవుతారు...
- వేంపల్లి వద్ద 2కోట్లకు ఎకరాకు ఉంది.. 550 కోట్ల విలువ ఉంది..
- దళితుల గొంతు కోస్తున్న ఎమ్మెల్యే పీఎస్సార్..
- రైతులను బెదిరిస్తూ భూములు లాక్కుంటున్న ప్రేమ్ సాగర్ రావు..
- రూ. 200 కోట్లు ఎమ్మెల్యేకు.. రూ. 13.5 లక్షలు రైతులకు..
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సంచల వ్యాఖ్యలు..

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు దళితుల గొంతుకోస్తున్నాడని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆరోపించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు విషయంలో పోచంపాడు గ్రామ శివారులోని వేంపల్లి, ముల్కల్లా, గ్రామాలకు చెందిన దళిత సోదరుల,బీసీ ల, భూములను తక్కువ ధర కు (13 లక్షల 50 వేల రూపాయలకు) ఎకరం చొప్పున నష్ట పరిహారం చెల్లించి అధికారులు,అధికార పార్టీ నాయకులు బెదిరించి వారి భూములను లాక్కున్నారని సంచలన ఆరోపణలు చేశారు. నోటిఫికేషన్ రాకముందే అధికారులు భూ సేకరణకు వెళ్లారని ఆరోపించారు. ఐదు నెలల క్రితం అధికారులు రైతుల నుంచి సంతకాలు తీసుకున్నారని విమర్శించారు. బలవంతంగా భూమును లాక్కోవడం ప్రజా పాలనా..? అని ప్రశ్నించారు. దౌర్జన్యంగా భూములు లాక్కోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.రైతులకు (నష్టపరిహారం) న్యాయంగా డబ్బులు చెల్లించి, ఆ స్థలంలో ఇండస్ట్రియల్ పార్క్ చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ భయపెట్టి, బెదిరించి వాళ్ల దగ్గర నుంచి అన్యాయంగా భూములు గనుక తీసుకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. దళిత,బీసీ లకు అండగా ఉంటామని చెప్పారు. రేపు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు అక్కడ భూములు కొనుగోలు చేసిన వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకొని వాటిని మళ్లీ దళితులు, బీసీలకే అప్పగిస్తామని స్పష్టం చేశారు.ప్రస్తుతం అక్కడ భూమి విలువలో 30% డబ్బు ప్రభుత్వానికి కట్టి, మిగతా 70% శాతం డబ్బు,కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇచ్చి మీరు భూములు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో మీరు కట్టిన డబ్బులు తిరిగి రావని కొనుగోలు దారులను హెచ్చరించారు. ఇప్పుడు మీరు తక్కువ ధరకు కొనుగోలు చేసినా భవిష్యత్ లో ఆ భూమి ని దళిత, బీసీలకు అప్పగించాల్సి వస్తుందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ రోజు ఆ భూమికి ఎంత రేటు ఉంటుందో అంత రేటు అక్కడ కొన్న వారే దళిత, బీసీ లకు చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అప్పుడు నా మద్దతు కూడా పూర్తిగా వాళ్లకే ఉంటుందన్నారు. ఒకవేళ ఇప్పుడు కొన్నవాళ్లు డబ్బు చెల్లించకపోతే ఆ భూమిని దళిత, బీసీలు ఆక్రమించుకుంటారన్నారు. వారికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు పూర్తిగా అండగా ఉంటారని చెప్పారు. అన్యాయానికి కొమ్ముగాసి, పేదవాళ్లను రోడ్డున పడేసి, అక్కడ వ్యాపారం చేసి డబ్బులు సంపాదించాలనుకోవడం సరికాదన్నారు.ఇప్పుడు ముల్కల్ల, వేంపల్లి గ్రామాలకు సంబంధించిన భూమి కోల్పోతున్న రైతులు, ఇప్పుడు బాండు పేపర్ మీద రాసి ఇస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారుల అండతో తమను బెదిరించి భూములు తీసుకుంటున్నారని, న్యాయం చేయాలని కోరుతున్నారని చెప్పారు .ఇష్టం లేకున్నా భయంతోనే తాము ఈ భూములు ఇచ్చి డబ్బులు తీసుకున్నామని తమ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. భయభ్రాంతులకు గురై ఒప్పుకున్నట్లు తనతో చెప్పారన్నారు. భవిష్యత్తులో మాకు న్యాయం చేయాలని అనేక మంది కోరుతున్నారని తెలిపారు.ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అక్కడ భూమి కొందాం అనుకుంటున్న ప్రతి వ్యక్తి ఒకటికి, పది సార్లు ఆలోచించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళిత, బీసీ రైతులకు భూమి యజమానులకు న్యాయం జరిగేంత వరకు మా సహకారం ఉంటుందనే అనే విషయాన్ని మరొక్కసారి సూటిగా మీడియా ద్వారా తెలియజేస్తున్నాని దివాకర్ రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్, పట్టణ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ

- అదనపు కలెక్టర్ ప్రకటన



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలో కొత్త ఆహార భద్రత కార్డులు మంజూరు, కార్డులలో సభ్యుల చేర్పుల కోసం అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ప్రకటించారు. గత రెండు నెలల్లో మంజూరు చేసిన 4,797 కొత్త రేషన్కార్డులు అర్హులైన వారికి అందించామన్నారు. రేషన్కార్డుల ముటేషన్ల కోసం అందిన 35,178 దరఖాస్తులను పరిశీలించి ఆమోదముద్ర వేశారు. కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెప్పారు. మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులకు కార్డులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

## గ్రామపాలన అధికారుల పరీక్షపై పకడ్బందీ చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



గ్రామపాలన అధికారుల రాత పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని సి.సి.ఎల్.ఎ. కమీషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. రాబోయే 25వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష జరగనుందని, మాస్ కాపీయింగ్ వంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటన మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, బందోబస్తు చర్యలు చేపట్టారు. విద్యుత్, వైద్య-ఆరోగ్యశాఖల సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు 155 మంది పరీక్షకు హాజరవుతుండగా, సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలు చేస్తామని పేర్కొన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నోట్స్ వంటి వస్తువులను అనుమతించరాదని ఆదేశాలు ఇచ్చారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అటవీ అనుమతుల జారీకి ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**శెనార్తి మీడియా, హైదరాబాద్ /మంచిర్యాల**

రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి పనులలో అవసరమైన అటవీ అనుమతుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ-శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అహ్మద్ నదీం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ అధికారులు, ఇతర అధికారులతో అభివృద్ధిలో భాగంగా అటవీ అనుమతుల జారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి పనులలో అవసరమైన అటవీ శాఖ అనుమతు లు పొందేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అటవీ ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు మౌళిక సదుపాయాలు కల్పించడానికి అటవీ అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని, అంగన్వాడీ కేంద్రాలు, తాగునీటి సరఫరా, విద్యుత్, పాఠశాలలు, ఆసుపత్రులు ఇతర ప్రజా ప్రయోజనకర అభివృద్ధి పనులకు సమర్పించిన ప్రతిపాదనల సంబంధిత అనుమతుల జారీకి ముందస్తు ప్రాధాన్యత ఇవ్వాలని, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల పరిధిలో చేపట్టే రహదారి నిర్మాణ పనులకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మానవతా దృక్పథంతో అటవీ నిబంధనలకు లోబడి అన్ని రకాల అనుమతులు జారీ చేయాలని, అవసరమైతే అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు జరిగేలా చూడాలని, తద్వారా ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయా జిల్లాల అటవీ అధికారులతో సమీక్షించి చేపట్టిన చర్యలు, పనుల పురోగతిపై ఈ నెల 28వ తేదీ లోగా నివేదిక అందించాలని తెలిపారు.రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ-శిశు సంక్షేమశాఖ మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంతో పోలిస్తే అటవీ ప్రాంతాలలో నివసించే ఆదివాసీ గిరిజనులు అభివృద్ధిలో వెనుకబడిన ఉన్నారని, అటవీ ప్రాంతాలలో నివసించే గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రహదారుల నిర్మా ణంలో అవసరమైన అటవీ అనుమతులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రహదారుల నిర్మాణం వలన కలిగే అభివృద్ధి, అటవీ ప్రాంతాలలో లభించే వనరుల వినియోగంపై గిరిజన ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... జిల్లాలోని అటవీ ప్రాంతాలలో, పోడు భూములలో వెదురు మొక్కల పెంపకంపై గిరిజనులకు అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందు కొరకు నర్సరీలలో వెదురు మొక్కలను అభివృద్ధి చేయడం జరుగుతుందని, సరిపడా మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉద్యానవన పంటల సాగుకు కోతుల బెడద ఉన్నందున జాతీయ వెదురు పథకం క్రింద వెదురు మొక్కల పెంపకంపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరాలుగా పట్టుపురుగుల పెంపకం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 1980 సంవత్సరాల కంటే ముందు నుండి వినియోగంలో ఉన్న మట్టి రోడ్లను సి.సి. / బి.టి. రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వ జి.ఓ. ప్రకారం అవకాశం ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు మునీర్ ఇకలేరు



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

తెలంగాణ ఉద్యమంలో కీలకం గా వ్యవ హరిం చిన సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ (69) ఇక లేరు. అనారోగ్యంతో బాధపడు తూ హైదరాబా ద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో శని వారం అర్ధ రాత్రి తుదిశ్వాస విడిచారు. మల్టీఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు.

**ఉద్యమాలకు అంకితం**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జన్మించిన మునీర్ విద్యార్థి దశ నుంచే పీడిత ప్రజల కోసం పోరాటాలు ప్రారంభించారు. సీపీఐ నేతలతో కలిసి అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. సింగరేణి కార్మికుడిగా ఉద్యోగం చేసినా జర్నలిజంపై మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి పత్రికా రంగంలో తన సేవలు అందించారు.

**పత్రికా రంగంలో తనదైన ముద్ర**

పలు ప్రముఖ పత్రికల్లో దశాబ్దాల పాటు పని చేసిన మునీర్, కార్మికుల హక్కుల కోసం తన రచనల ద్వారా గొంతుకగా నిలిచారు. ‘బండ కింద బతుకులు’ వంటి ప్రత్యేక శీర్షికలతో పీడిత ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చారు.

**తెలంగాణ ఉద్యమంలో విశిష్ట పాత్ర**

స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో మునీర్ కీలక పాత్ర పోషించారు. సకల జనుల సమ్మెకు సింగరేణి కార్మికులను సమాయత్తం చేసి ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. సమైక్య పాలనలో సింగరేణికి జరిగిన అన్యాయాన్ని వివరించి కార్మికులను చైతన్యవంతులను చేశారు.

**జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటం**

సమాజం కోసం మాత్రమే కాకుండా, జర్న లిస్టుల హక్కుల పరిరక్షణకు కూడా మునీర్ పాటుపడ్డారు. ఆయన కలం సామాజిక ఆలోచనలకు దారిదీపంగా నిలిచింది.

**విషాదంలో సింగరేణి ప్రాంతం**

మునీర్ మృతితో సింగరేణి ప్రాంతం విషాదంలో మునిగి పోయింది. ఆయన మృతి పట్ల జర్నలిస్టు సంఘాలు, తెలంగాణ ఉద్యమ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. మునీర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## గ్రూప్-2 ఉద్యోగానికి ఎంపిక





**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ఇటీవల విడుదల చేసిన టీజీపీఎస్సీ గ్రూప్-2 తుది ఫలితాలలో జిల్లాకు చెందిన పలువురు ఎంపికయ్యారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావు పేటకు చెందిన బత్తుల సత్తయ్య, విజయ దంపతుల కూతురు బత్తుల సౌమ్య 940 ర్యాంకుతో గ్రూపు -2 ఉద్యోగానికి ఎంపికయ్యింది. సౌమ్య బీ టెక్ పూర్తి చేసి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగానికి ఎంపికవడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మందమర్రి మండలం రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాస్ సైతం ఎంపికయ్యారు. దీనితో వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్నాడు.

## ఈ నెల 26న లైసెన్సు సర్వేయర్లకు శిక్షణ

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లా కేంద్రంలోని ఉషోదయ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న ఉదయం 10 గంటల నుండి మొదటి బ్యాచ్‌కు ఎంపికైన లైసెన్సు సర్వేయర్లకు శిక్షణ నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, కమ్యూనిటీ ధృవీకరణ పత్రాలు నిజ ప్రతులతో పాటు ఒక సెట్ నకలు ప్రతులను సమర్పించాలి.సివిల్ సర్జన్ జారీ చేసిన శారీరక ధృఢత్వ ధృవీకరణ పత్రం కూడా తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా సర్వే, భూరికార్డుల ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్ తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన సర్వేయర్



**శెనార్తి మీడియా, నిర్మల్**

నిర్మల్ జిల్లా కడం తహసిల్దార్ కార్యాలయంలో శనివారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అకస్మాత్తుగా దాడులు నిర్వహించి, సర్వేయర్ ఉమాజీని లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. గంగాపూర్ గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్ భూమి సర్వే కోసం సర్వేయర్ ఉమాజీ కి సంబంధించిన పత్రాలు సిద్ధం చేయాలని కోరగా, ఆయన రూ.20,000 లంచం డిమాండ్ చేశారు. ప్రభాకర్ ఇప్పటికే రూ.12,000 చెల్లించినప్పటికీ, మిగిలిన రూ.7,000 తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దాడులు కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ విజయ్ తెలిపారు. కార్యక్రమంలో సీఐ స్వామి, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల ముఠా పై టాస్క్ ఫోర్స్ దాడి..

- 60 లక్షల విలువైన నిషేధిత విత్తనాలు స్వాధీనం..
- మూడు మంది అరెస్టు, ప్రధాన నిందితుడు పరారీలో..



**శెనార్తి మీడియా, మంచిర్యాల/ఆసిఫాబాద్**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ నకిలీ పత్తి విత్తనాల రహస్యం ఛేదించబడింది. జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 60 లక్షల విలువ చేసే 20 క్వింటాళ్ల నిషేధిత బీటీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగజ్నగర్‌కు చెందిన కొత్తపల్లి సదశివ్, వాహన డ్రైవర్ పుప్పాల లక్ష్మన్, మహారాష్ట్రకు చెందిన సంతోష్ కిషోర్‌లను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న వేణుగోపాల్ రెడ్డిని త్వరలో అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ప్రకటించారు.ఈ ఆపరేషన్‌లో సీఐ రాణా ప్రతాప్, ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు నిష్ణాతంగా పనిచేశారు. టాస్క్ ఫోర్స్ బృందం అనుమానాస్పద వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో నిషేధిత నకిలీ విత్తనాలు లభించాయి. నకిలీ విత్తనాల విక్రయాలు జిల్లాలో పేద రైతులను తీవ్రంగా నష్టపరిచే అవకాశముందని, ఇలాంటి దుశ్చర్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.నకిలీ విత్తనాలను సరఫరా చేసేవారిపై పోలీసు శాఖ భవిష్యత్తులో మరింత కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ టాస్క్ ఫోర్స్ బృందం చేసిన ప్రతిష్ఠాత్మక పని ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ వారిని అభినందించారు.